
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
సోమవారం 26 మే 2025
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 31.0 । కనిష్ఠం : 24.0



దున్నే వాడికే భూమి హక్కులు దక్కాలి

- గిరిజన రైతులకు భూ పట్టాలు ఇవ్వాలి
- భూస్వాముల అక్రమాలు అరికట్టాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

7

2డే లీగ్‌లో మహబూబ్‌నగర్ జోరు

- తొలి ఇన్నింగ్స్‌లో 125 పరుగులకు నాగర్‌కర్నూల్ ఆలౌట్
- బౌలింగ్‌లో చెలరేగిన ముఖీద్, శ్రీకాంత్

7



కేజీబీవీల్లో మెరుగైన విద్య

- ప్రారంభమైన ప్రవేశాలు

7

రేషన్ బియ్యం స్వాధీనం

పోలీసులకు పట్టుబడిన రేషన్ బియ్యం వాహనం



రాజకయ్యం

వనపర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ సోషల్ మీడియా వార్



విలేకరుల సమావేశంలో భూకబ్జా వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి (ఫైల్)



ఎస్పీ రావుల గిరిధర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్(ఫైల్)

- మాజీ మంత్రి భూ కబ్జా చేశారని ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రెస్‌మీట్
- అప్పటి నుంచి రెచ్చిపోతున్న ఇరువర్గాల నాయకులు
- నిరంజన్‌రెడ్డికి ఎమ్మెల్యే పరువు నష్టం నోటీసులు
- అనంతరం పెరిగిన రాజకీయ వేడి.. ఇరుపక్షాల బూతుపురాణం
- బీఆర్ఎస్ నాయకులపై కేసులు.. ప్రతిగా ఎస్పీకి బీఆర్ఎస్ ఫిర్యాదు

మహబూబ్‌నగర్, మే 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వనపర్తిలో స్తబ్దుగా ఉండే రాజకీయం రచ్చకెక్కింది. సామాజిక మాధ్యమాల్లో పోస్టులతో సోషల్ వార్ కొనసాగుతోంది. బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసుల నమోదు, ప్రతిగా కాంగ్రెస్ నాయకులపై పోలీసులకు ఫిర్యాదులు వెరసి.. బూతుపురాణం మొదలైంది. న్యాయపరంగా, చట్టపరంగా ఎదుర్కోవాల్సిన అంశాలను కూడా సోషల్ మీడియాలో పెట్టి.. కార్యకర్తలు చేసే రచ్చతో పార్టీ నాయకులు కూడా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. గత ఆదివారం ఎమ్మెల్యే మేఘారెడ్డి తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆ సందర్భంగా జోగుళాంబ గద్వాల జిల్లాలోని మానవపాడు మండలం చండూరులో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి 2.19 ఎకరాలు భూ కబ్జాకు పాల్పడ్డారని ఆరోపించారు. అధికారులు చేసిన సర్వే, తర్వాత అధికారుల ఆదేశాలతో మార్చిన హద్దులు.. తదితర వివరాలను వివరించారు. ఆధారాలతో సహా నిరూపణ అయినందున పార్టీ అధిష్ఠానం సమర్థిస్తుందో.. సస్పెండ్ చేస్తుందో తేల్చుకోవాలని సవాల్ కూడా చేశారు. ఇక ఆ రోజు నుంచే సోషల్ మీడియా, పత్రికల్లో ఈ వార్తలు కవర్ కావడంతో ఆయా పార్టీల సోషల్ మీడియా వారియర్స్ కూడా యాక్టివేట్ అయ్యారు. ఒకరిపై ఒకరు నిందారోపణలు చేసుకుంటూ రచ్చరచ్చ చేస్తున్నారు. తర్వాత రోజు ఖిల్లాఘణపూర్ మాజీ ఎంపీపీ కృష్ణనాయక్ నిరంజన్‌రెడ్డి ఇంటి వద్ద పత్రికా సమావేశం నిర్వహించి, మేఘారెడ్డిపై విమర్శలు చేశారు. తమ నాయకుడు నిరంజన్‌రెడ్డి ఎలాంటి కబ్జా చేయలేదని ఖండించారు. గంజాయి మొక్కలు, తులసి మొక్కలు, నమ్మకద్రోహం, ఒళ్లంతా విషం వంటి పదాలు ఇరుపక్షాల నాయకుల మాటల్లో సర్వసాధారణంగా మారాయి. వారం రోజులుగా ఆయా పార్టీల నాయకులు ఉన్న వాట్సప్ గ్రూపులు,

(మిగతా 6లో..)



చిత్తశుద్ధి ఏదీ?

- ప్లాస్టిక్ నిషేధంపై కొరవడిన శ్రద్ధ
- సప్లై చేసే మూలాలను వదిలేసి హోటళ్లు, చిరువ్యాపారులపై రైడింగ్‌లు
- బడా, హోల్‌సేల్ వ్యాపారులను వదిలేస్తున్నారన్న విమర్శలు
- సీజ్ చేసిన ప్లాస్టిక్ కవర్లు దొడ్డి దారిన మళ్లీ మార్కెట్‌లోకి..
- జ్యూట్, క్లాత్, పేపర్ బ్యాగ్‌ల తయారీని ప్రోత్సహించాలి

6

పీఎఫ్ ఉన్నా.. పింఛన్ రాక

పదేళ్లుగా.. అవస్థలు

- అర్హులైన బీడీ కార్మికులకు అందని జీవన భృతి
- ఉమ్మడి జిల్లాలో 50 వేల మంది కార్మికులు

రెక్కాడితే గాని డొక్కాడని బీడీ కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా వారి బతుకులలో మార్పు రావడం లేదు. ఎన్నికలకు ముందు కార్మికుల స్థితిగతులపై అధ్యాయనం చేసి, వారి పరిస్థితిని మెరుగు పరుస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం.. సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించ లేదన్న విమర్శలు వస్తున్నాయి. గవర్నమెంట్ ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా ప్రావిడెంట్ ఫండ్ కలిగి ఉండి అర్హులైన వారికి నేటికీ పింఛన్ సౌకర్యం కల్పించకపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అమరచింతలో బీడీలు చుడుతున్న మహిళలు

అమరచింత, మే 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ మొదటిసారి అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే 2014 సంవత్సరంలో కుటుంబ సమగ్ర సర్వే నిర్వహించి అప్పట్లో బీడీ కార్మికులుగా నమోదు చేసుకున్న వారికి పింఛన్లను మంజూరు చేసింది. ఆ తరువాత ఆన్‌లైన్ సైట్‌ను బంద్ చేసింది. 2014లో బంద్ అయిన సైట్ నేటికీ ఓపెన్ కాకపోవడంతో వందలాది మంది అర్హులైన బీడీ కార్మికులు పింఛన్ అందక తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. కుటుంబ సమగ్ర సర్వేలో బీడీ కార్మికులుగా అనేక మంది పేర్లు నమోదు చేయించుకున్నారు. అందరికీ పింఛన్లు ఇవ్వడంతో అందులో బీడీ వృత్తికి దూరంగా ఉన్న అనర్హులు కూడా చాలా మందికి పింఛన్లు అందుతున్నాయని తెలిసింది. ఒక్క అమరచింతలోనే నాలుగు బీడీ ఫ్యాక్టరీల పరిధిలో 600 కుటుంబాలకు పీఎఫ్ కలిగి ఉంటే కుటుంబ సమగ్ర సర్వే ఆధారంగా 700 మంది దాకా పింఛన్లు వస్తున్నాయని తెలిసింది. ఇంకా పీఎఫ్ కలిగి ఉన్న 450 మంది అర్హులైన బీడీ కార్మికులకు నేటికీ పింఛన్లు

(మిగతా 6లో..)



జిల్లా కేంద్రంలో పరీక్ష కేంద్రంలోనికి వెళ్తున్న అభ్యర్థులు

ప్రశాంతంగా గ్రామ పరిపాలనాధికారుల పరీక్ష

- 112 మంది అభ్యర్థులు హాజరు
- పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్ టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన గ్రామ పరిపాల నాధికారి పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 119 మంది అభ్యర్థులకు గాను 112 మంది హాజరు కాగా 7 మంది హాజరు కాలేదు. కలెక్టర్ బదావత్ సంతోష్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పరిపాలనాధికారి పరీక్ష ల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంతంగా ముగిసినందుకు నిర్వాహకులను అభినందించారు.



జిల్లా కేంద్రంలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

వక్ఫ్ చట్ట సవరణ రాజ్యాంగ విరుద్ధం

- ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు మౌలానా ఖలీద్ సైఫుల్లా రహ్మనీ



అభివాదం చేస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

మహబూబ్‌నగర్ అర్బన్, మే 25(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వక్ఫ్ చట్ట సవరణ బిల్లు సరికాదని, ఇది రాజ్యాంగా విరుద్ధమని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు మౌలానా ఖలీద్ సైఫుల్లా రహ్మనీ, కర్ణాటక మాజీ మంత్రి సీఎం ఇబ్రాహీం, ఇతర ప్రముఖులు అన్నారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని బాలుర కళాశాల మైదానంలో బహిరంగ సభ నిర్వహించారు. సభకు కమిటీ కన్వీనర్ మౌలానా నయీంకౌసర్ అధ్యక్షత వహించారు. మౌలానా ఖలీద్ సైఫుల్లా రహ్మనీ, ఇబ్రాహీం, హైదరాబాద్‌కు చెందిన ముఫ్తీ ఖలీల్ అహ్మద్, కలకత్తాకు చెందిన ప్రముఖ ధార్మిక వేత్త అబుతాలిబ్ రహ్మనీ, ముస్లిం పర్సనల్ బోర్డు ప్రతినిధులు, మతపెద్దలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వక్ఫ్ చట్టం క్రూరమైందన్నారు. దానిని రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించారు. ఆర్టికల్ 14, 15, 25ను ఈ బిల్లు ఉల్లంఘిస్తున్నదని, ఇది వివక్ష పూరితమైదనదని విమర్శించారు. వక్ఫ్ బోర్డు చట్టంలో అధికారాలను హరిస్తూ, వక్ఫ్ ఆస్తులపై నియంత్రణ సాధించాలని నడుచుకుంటున్నారని ఆరోపించారు. కేవలం మత రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవుపలికారు. వక్ఫ్ చట్టం వెనక్కి తీసుకోవాలని, అప్పటి వరకు పోరాటం కొనసాగుతుందని వెల్లడించారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంలో అన్ని మతాలకు హక్కులు కల్పించిదన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా ఇలాంటి చట్టం చేయడం సరికాదన్నారు. పాత వక్ఫ్ చట్టాన్ని మార్చడం సరికాదని, దానినే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కర్నూల్ మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ హఫీజ్ ఖాన్, మలకపేట్ ఎమ్మెల్యే అహ్మద్‌బలాల, జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు హమేద్ మహమ్మద్ ఖాన్, మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, నాయకులు అబ్దుల్‌హదీ, సిరాజ్‌ఖాద్రీ, జాకీర్ అడ్వకేట్, జాబేర్‌బిన్‌సయాద్, ఇద్రీస్ పాల్గొన్నారు.

నేడు ఉపముఖ్యమంత్రి రాక

- భట్టి విక్రమార్క పర్యటనకు ఏర్పాట్లు పూర్తి
- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్



డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

అచ్చంపేట/కల్వకుర్తి, మే 25 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని బల్మూరు మండలం గట్టుతుమ్మెన్ గ్రామంలో సోమవారం పర్యటించనున్నట్లు నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. ఆయన ఆదివారం అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గట్టుతుమ్మెన్‌పేట గ్రామంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్, నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 132/33 కేవీ, 33/11కేవీ, సబ్‌స్టేషన్ పనులకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఉదయం 9 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట ప్రజాభవన్ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 11 గంటలకు గట్టుతుమ్మెన్‌కు చేరుకుంటారని తెలిపారు. అక్కడే ఏర్పాటు చేసిన ప్రాంగణంలో రూ.25 కోట్లతో పోల్కంపల్లిలో, రూ1.82 కోట్లతో బొమ్మన్‌పల్లిలో, రూ.1.73 కోట్లతో పదరలో నిర్మించనున్న సబ్‌స్టేషన్ల శిలాఫలకాలను ఆవిష్కరిస్తారని తెలిపారు. రూ.2.24 కోట్లతో లింగాల మండలం బాకారంలో రూ.2.74కోట్ల అంచనాతో వంగూరు మండలం ఉల్పర గ్రామంలో, రూ1.99 కోట్ల అంచనాతో అచ్చంపేట మండలం సింగారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న 3311కేవీ సబ్‌స్టేషన్ల పనులకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఉదయం 12 గం టలకు అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతారని తెలి పారు.

అదేవిధంగా కల్వకుర్తి నియోజకవర్గంలో మల్లు భట్టి విక్రమార్క పర్యటన ఉంటుం దని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని తలకొండపల్లి మండలం ఖానాపూర్, కడ్తాల మండలంలోని మట్టమాదారం, ఆమన్‌గల్ మండలంలోని సంకటోనిపల్లి, మాడ్గుల మం డలంలో కలకొండ, వెల్దండ మండలంలోని కొట్ర గ్రామంలో నూతనంగా నిర్మించే 33, 11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల నిర్మాణాలకు శంకుస్థాపన, ఖానాపూర్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. సాయంత్రం 4:15గంటల తర్వాత ఉప ముఖ్యమంత్రి సభ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. సభకు నియోజకవర్గంలోని ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవం తం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

వనపర్తి జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం



వనపర్తి పట్టణంలో కురుస్తున్న వర్షానికి లైట్లు వేసుకొని వెళ్తున్న వాహనదారులు

వనపర్తి, మే 25 (ఆంధ్రజ్యోతి) : నాలుగు రోజులుగా వనపర్తి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. పెబ్బేరు, శ్రీరంగాపూర్, గోపాల్‌పేట, చిన్నంబావి, వీపనగండ్ల ప్రాంతాలలో కొనుగోలు కేంద్రాల వద్ద పోసిన ధాన్యపు రాశులు తేమశాతం రాక నిర్వాహకులు కొనుగోలు చేయడం లేదని రైతులు మండి పడుతున్నారు. ఈసారి పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేవల్లి మండలంలో అత్యధికంగా 22.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.



పెబ్బేరు మండలంలోని పాతపల్లి గ్రామంలో వర్షానికి తడిసిన ధాన్యపు బస్తాలు



ధాన్యపు సంచులపై కప్పి ఉంచిన కవర్ల మీద నిలిచిన వర్షపు నీరు

రాజ'కయ్యం'

(5వ పేజీ తరువాయి)

కార్యకర్తల ఫేస్‌బుక్ పేజీల్లో సోషల్ వార్ కొనసాగుతూనే ఉంది. అయినా అటు మేఘారెడ్డి కానీ.. ఇటు నిరంజన్‌రెడ్డి కానీ ఇరువురు బయటకు ఏం మాట్లడ లేదు. కేవలం కార్యకర్తలు, నాయకుల మధ్య తతంగంగా నిందారోపణలు కొనసాగుతున్నాయి.

పురువు నష్టం నోటీసులు..

వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి గత ఆదివారం పత్రికా సమావేశం నిర్వహించిన అనంతరం.. తర్వాత రోజు బీఆర్ఎస్ సమావేశం నిర్వహించి, ఖండించింది. ఆ తర్వాత ఇది ఆగిపోవాలి. కానీ కార్యకర్తలు దాన్ని సోషల్ మీడియాలో పెంచి పోషించారు. అయితే ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత నుంచి పలు సందర్భాల్లో మేఘారెడ్డి తన పరువుకు భంగం కలిగించేలా మాట్లాడుతున్నారనే ఉద్దేశంతో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి రూ.10 కోట్లకు పరువు నష్టం నోటీసులు పంపించినట్లు తెలుస్తోంది. గతంలో ఆయన మాట్లాడిన మాటలను, సందర్భాలను కూడా ఈ నోటీసులో పేర్కొన్నట్లు సమాచారం. ఈ నోటీసులు పంపించిన విషయం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు తెలియడంతో.. వారు కూడా బీఆర్ఎస్ కార్యకర్తల పోస్టులకు కౌంటర్ అటాక్ పోస్టులను పెంచారు. ఎన్ని గ్రూపుల్లో పోస్టులు పెట్టగలిగితే అన్ని గ్రూపుల్లో పోస్టులు పెడుతూ, కౌంటర్ ఇచ్చారు. ఇదే సమయంలో కవిత కేసీఆర్‌కు రాసిన లేఖ లీక్ కావడంతో దానిపై మేఘారెడ్డి సీఎల్పీ కార్యాలయంలో ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. ఆ విషయాలు కూడా సోషల్ మీడియాలోకి కాంగ్రెస్ కార్యకర్తలు పోస్టు చేశారు. దాంతో బీఆర్ఎస్ కార్యకర్తలు ఎమ్మెల్యేను దూషిస్తూ కామెంట్లు పెట్టారు. స్థాయి ఎంత, గురివింద గింజలాంటి పదాలు వాడుతూ రెచ్చగొట్టారు. తర్వాత కాంగ్రెస్ కార్యకర్తలు మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిపై అదే స్థాయి, అంతకంటే ఎక్కువ స్థాయిలో దూషణలకు దిగారు. ఈ తతంగంతో బూతుపురాణం తారస్థాయికి చేరింది. ఎవరికి ఎవరు తక్కువ కాదనట్లు ఇరుపక్షాల నాయకులు ఇష్టారీతిన పోస్టులు పెట్టడంతోనే రాజకీయ వేడి రాజుకుంది.

ఎస్పీకి మాజీ మంత్రి ఫిర్యాదు..

సోషల్ వార్‌పై మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఏకంగా ఎస్పీ కార్యాలయానికి తన ఇంటి నుంచి ర్యాలీగా వెళ్లి.. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ చేతుల మీదుగా ఫిర్యాదు చేయించారు. ఫిర్యాదులో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తమ నాయకులు, నిరంజన్‌రెడ్డిని దూషిస్తూ పోస్టింగులు పెట్టారని, దానికి ప్రజాస్వామ్యయుతంగా తమ కార్యకర్తలు సమాధానం చెబుతూ పోస్టులు పెట్టారని పేర్కొన్నారు. కానీ దొడగుంటపల్లికి చెందిన మిద్దెగొల్ల కొండన్న, పి.సురేష్‌లను అక్రమంగా అరెస్టు చేసి, పెద్దమందడి పోలీసులు వేధించారని ఆరోపించారు. గతంలో ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. అయితే ఈ విషయంపై కూడా సోషల్ మీడియాలో ట్రోలింగ్ నడుస్తోంది. వ్యతిరేక పోస్టు పెట్టారని సొంత పార్టీ కార్యకర్తను తాము పోలీసులతో కొట్టించలేదని, ఎంతోమంది ఇతర పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి, కోర్టుల చుట్టూ తిప్పలేదని కాంగ్రెస్ కార్యకర్తలు సోషల్ మీడియాలో కౌంటర్ ఇస్తున్నారు. ఇరు పార్టీల ముఖ్య నాయకుల విమర్శ, ప్రతి విమర్శల వరకే పోస్టులు ఉండేలా సోషల్ మీడియా వారియర్స్‌ను పరిమితం చేయకపోతే.. ఇది వింత పోకడలకు దారితీసే అవకాశం ఉంది.

నేడు ఆ టీచర్లు డైట్ కళాశాలలో హాజరు కావాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ బోధన చేసిన మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన 24 మంది ఉపాధ్యాయుల జాబితాను ఎస్‌సీఈఆర్‌టీ ఆన్‌లైన్‌లో పొందుపరిచిందని, వారంతా సోమవారం ఉదయం 10 గంటలకు డైట్ కళాశాల వద్ద హాజరుకావాలని డీఈవో ప్రవీణ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల వరకు రావాలని పేర్కొన్నారు. వారిలో ప్రతిభ గల మూడు నుంచి ఆరు మంది ఎంపిక చేసి, వివరాలను కలెక్టర్‌కు పంపించనున్నట్లు తెలిపారు.



పశువులను తరలిస్తున్న వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

గోవులను తరలిస్తే చర్యలు తప్పవు

మిడ్జిల్, మే 25 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా గోవులను తరలిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేదిలేదని వెటర్నరీ వైద్యుడు శివరాజ్ తెలిపారు. ఆదివారం మండలంలోని మున్ననూర్ టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రం వద్ద మూగజీవాలను తరలిస్తున్న పలు వాహనాలతో పాటు పత్రాలను పరిశీలించారు. వెటర్నరీ సిబ్బంది సాగర్, వెంకటేష్, రెవెన్యూ సిబ్బంది కృష్ణయ్య, శ్రీశైలం, పోలీస్ సిబ్బంది రహీం, శేఖర్ పాల్గొన్నారు.



బూరుగుపల్లిలో నెత్తిన బోనాలతో చౌడమ్మ దేవాలయానికి ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్థులు

ఘనంగా చౌడమ్మ బోనాలు

జడ్చర్ల, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూర్గుపల్లిలో చౌడమ్మ అమ్మవారి బోనాలను ఆదివారం కురుమ, యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలో రెండు రోజులుగా సంఘం ఆధ్వర్యంలో కులదైవమైన చౌడమ్మ అమ్మవారి విగ్రహన్ని ప్రతిష్ఠించగా, ఆదివారం మహిళలు బోనాలను ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకొని అమ్మవారికి సమర్పించారు. యాదవ సంఘం సభ్యులు కృష్ణయాదవ్, మల్లేష్, రాములు, కుర్వ శ్రీనివాస్, భరత్‌కుమార్, మల్లేష్ యాదవ్, శ్రీశైలం, కొండల్, దశరథం, పరమేశ్, రాజు, ఎడ్ల చెన్నయ్య పాల్గొన్నారు.

చిత్తశుద్ధి ఏదీ?

- ప్లాస్టిక్ నిషేధంపై కొరవడిన శ్రద్ధ
- సప్లై చేసే మూలాలను వదిలేసి హోటళ్లు, చిరువ్యాపారులపై రైడింగ్‌లు
- బడా వ్యాపారులు, హోల్‌సేల్ వ్యాపారులను వదిలేస్తున్నారన్న విమర్శలు
- జ్యూట్, క్లాత్, పేపర్ బ్యాగ్‌ల తయారీని ప్రోత్సహించాలి



మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ కార్యాలయం

మహబూబ్‌నగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధంపై అధికార యంత్రాంగం చేస్తున్న ప్రయత్నాలన్నీ బుట్టదాఖలవుతున్నాయి. ఓ అడుగు ముందుకేస్తే రెండడుగులు వెనక్కి పడుతున్నాయి. దీంతో దశాబ్దకాలంగా చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. గుర్తుకు వచ్చినపుడల్లా రైడింగ్ అంటూ వారం రోజులు హడావుడి చేసి, ఆపై ఆరు నెలలు వదిలేయడంపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. దాడులు చేయడం వల్ల తాము మాత్రమే ఇబ్బందులు పడుతున్నామని, తమకు ప్లాస్టిక్ విక్రయించే బడా వ్యాపారులు, కంపెనీలు, హోల్‌సెల్ దుకాణుదారుల జోలికి ఎందుకు వెళ్లడం లేదని చిరువ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. అసలు మా వద్దకు రాకుండా పైస్థాయిలోనే వాటి మూలాలు కత్తిరిస్తే ప్లాస్టిక్ గొడవ ఉండదు కదా అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణానికి పెను ప్రమాదంగా మారుతున్న ప్లాస్టిక్‌ను నిషేధించాలని, అందులో 120 మైక్రాన్‌లన్నా తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్‌ను అసలు వినియోగించొద్దని ప్రభుత్వం కొన్నేళ్లుగా నిషేధం విధించింది. పురపాలికల్లో దీనిపై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించినా, సరైన విధానంలో కట్టడి చేయకపోవడం వల్ల పురపాలికలు, నగరపాలక సంస్థలలో యథేచ్ఛగా ప్లాస్టిక్ వాడకం కొనసాగుతూనే ఉంది.

రోజూ రైడింగ్ చేయాలని ఆదేశాలు

రెండ్రోజుల క్రితం పాలమూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ పాలమూరు కార్పొరేషన్‌తోపాటు జడ్చర్ల, భూత్పూర్ పురపాలికల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. 120 మైక్రాన్‌ల కన్నా తక్కువ మందం కవర్లను వినియోగించవద్దని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తోపాటు ప్లాస్టిక్ స్పూన్, ఫోర్క్స్, ప్లేట్స్, గ్లాస్, ప్లాస్టిక్ ఇయర్‌బడ్స్ వాడకూడదని చెప్పారు. వాటిపై రోజూ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఉన్నతాధికారి ఆదేశాల మేరకు వ్యాపారులపై రైడ్స్ నిర్వహిస్తున్నారు. అయితే అసలు ఉత్పత్తిచేసే వాళ్లు, చిరువ్యాపారులకు వాటిని విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటే తమ వరకు రావాల్సిన అవసరం ఉండదని చిరువ్యాపారులు అంటున్నారు. తమ వద్దకు వచ్చి రైడ్ చేసి, పట్టుకుపోయిన కవర్లన్నింటిని మళ్లీ కొందరు సిబ్బంది మార్కెట్‌లో విక్రయించుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఇలా చేయడం వల్ల ఎన్నాళ్లైనా నిషేధం అమలు కాదన్నది స్పష్టమవుతోంది. మార్కెట్‌లో 120 మైక్రాన్‌ల కన్నా తక్కువ మందం గల కవర్లు కిలోకు రూ.170-180 వరకు విక్రయిస్తున్నారు. అదే మందం గల కవర్లు కిలోకు రూ.100-110కే విక్రయిస్తున్నారు. అయితే తక్కువ మందంగల కవర్లు రెండింతలు వస్తున్నాయి. అందుకే వాటిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఆ ఉత్పత్తులను నిషేధించాల్సిన అవసరం ఉంది. హోల్‌సేల్ వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి, 120 మైక్రాన్‌ల కన్నా తక్కువ మందం గల కవర్లను విక్రయించొద్దని కఠిన ఆదేశాలు జారీ చేయాల్సిన అవసరం ఉంది.

అధిక జరిమానా విధించాలి

అదే సమయంలో వారికి జ్యూట్, క్లాత్‌తో తయారు చేసిన బ్యాగ్‌లను విక్రయించేలా అవగాహన కల్పించాలి. మార్కెట్‌లోకి ప్లాస్టిక్ రావడం బంద్ చేస్తే నెమ్మదిగా వాటి వినియోగం తగ్గిపోతుంది. వినియోగదారులు కూడా ఇళ్లవద్ద నుంచే మార్కెట్‌కు వెళ్లే సమయంలో బ్యాగ్‌లు, స్టీల్ బాక్స్‌లు తీసుకెళ్లేలా వార్డుల వారీగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. జిల్లాలోనే కాకుండా ఉమ్మడి జిల్లాలోని అన్ని పురపాలికల్లో ఇదే పరిస్థితి ఉంది. అధికార యంత్రాంగమంతా కఠినంగా వ్యవహరించి యజ్ఞంలా కార్యక్రమాలు తీసుకుంటే తప్ప ప్లాస్టిక్ నిషేధం అమలు కాదన్న విషయం స్పష్టమవుతోంది. రైడింగ్‌లో ప్లాస్టిక్ దొరికిన దుకాణాలకు రూ.2 వేలు, రూ.5 వేలు జరిమానా విధించడం వల్ల కూడా పెద్దగా ఉపయోగం ఉండదు. జరిమానా పెద్ద ఎత్తున ఉంటే చిరువ్యాపారులు వాటిని వినియోగించడానికి భయపడతారు. పాలమూరు నగరపాలిక సంస్థలో రెండేళ్ల క్రితం మహిళా సంఘాల సభ్యులకు క్లాత్ బ్యాగులను తయారు చేయించారు. కొద్ది రోజులకే మహిళా సంఘంలో జరిగిన కుంభకోణంతో ఉత్పత్తులు నిలిచిపోయాయి. ప్రతి పురపాలికలో కొన్ని మహిళా సంఘాలకు జ్యూట్, క్లాత్, పేపర్ బ్యాగ్‌లను తయారు చేయించే మిషనరీలను ఏర్పాటు చేసి వాటిని మార్కెట్‌లోకి తీసుకెళ్లేలా యంత్రాంగం చర్యలు తీసుకోవాలి.



మహబూబ్‌నగర్ పట్టణంలోని దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న సిబ్బంది(ఫైల్)



పట్టుబడిన ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న సిబ్బంది(ఫైల్)

బాలల పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సమితి చైర్మన్ సీతాదయాకర్‌రెడ్డి



ఎస్పీతో సమావేశమైన చైర్మన్ సీతా దయాకర్‌రెడ్డి

వనపర్తి, మే 25 (ఆంధ్రజ్యోతి) : బాలల పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సమితి చైర్మన్ సీతా దయాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రావుల గిరిధర్ ఆమెతో పాటు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యురాలు బండి అపర్ణ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్రంలో బాలల పరిరక్షణ కోసం భౌతికంగా, మానసికంగా, సామాజికంగా వారిని రక్షించడం కోసం బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. బాలల పరిరక్షణ కోసం 2005 సంవత్సరంలో బాల కార్మికుల నిషేధం నియంత్రణ చట్టం, 1986 లో లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం, 2012లో బాల్య వివాహాల నిషేధ చట్టం గురించి తెలిపారు. అనంతరం బాలల కోసం అమలు చేసిన చట్టాలు, జిల్లాలోని వివిధ పోక్సో కేసుల గురించి ఎస్పీతో చర్చించారు. జిల్లాలో బాలలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా అధైర్యపడకుండా నేరుగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. పోలీస్ శాఖ నిరంతరం వారి కోసం పని చేస్తుందని తెలిపారు.

ఇసుక రవాణాను అడ్డుకున్న గ్రామస్థులు

ఉప్పునుంతల, మే 25 (ఆంధ్రజ్యోతి) : అనుమతుల పేరుతో ఇష్టానుసారంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామస్థులు ఆదివారం అడ్డుకున్నారు. వంగూర్ మండలం పోతిరెడ్డిపల్లి సమీపంలోని దుందుభీ వాగు నుంచి మైనింగ్ శాఖ ద్వారా అనుమతులు పొంది రెండు టిప్పర్లు రాత్రింబవళ్లు ఇసుకను తరలిస్తుండగా, ఉప్పునుంత మండలం పెద్దాపూర్ గ్రామస్థులు అడ్డుకుని ఆందోళన చేశారు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసు అక్కడికి వచ్చి ఇసుకకు అనుమతులు ఉన్న వాహనాలను అడ్డుకుంటే కేసులు చేస్తామని గ్రామస్థులను హెచ్చరించారు. గ్రామస్థులు మాట్లాడుతూ ఇసుకను తరలించేందుకు అధికారులు, నాయకులు సహకరిస్తున్నారని, పేదలు ఇళ్లు కట్టుకునేందుకు అనుమతులు కావాలని అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోరని పేర్కొన్నారు. అక్రమ వ్యాపారం చేసే వారికి తక్షణమే అనుమతులు ఇస్తూ మామూళ్లు పొందుతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని ఇసుక రవాణాను అరికట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

బల్మూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొండనాగుల సమీపంలో ఉన్న పెద్దగుడిబండ శివాలయంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిగినట్లు ఆలస్యంగా తెలిసింది. గుడిబండ శివాలయంలోని శివుని లింగం పక్కన బండలను పెకిలించి తవ్వి మళ్లీ సిమెంట్ చేసి దుండగులు తమ వెంట తెచ్చుకున్న ఇతర సామగ్రిని వదిలి వెళ్లిన సంఘటన ఆలస్యంగా ఆదివారం ఉదయం తెలియడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ ప్రాంగణాన్ని పోలీసులు పరిశీలించినట్లు స్థానికులు తెలిపారు. శుక్రవారం రాత్రి జరిగిన సంఘటనను ఆదివారం పూజారి నిమ్మల రాజుతోపాటు మరికొందరు తెలియజేయడంతో కేసు ఛేదిస్తామని ఎస్ఐ రమాదేవి తెలిపారు.

సంగమేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తులు



సంగమేశ్వర ఆలయం సమీపంలో నిలిచిన వాహనాలు

కొల్లాపూర్, మే 25 (ఆంధ్రజ్యోతి) : తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆరాధ్య దైవంగా పూజించే సప్తనదుల సంగమ క్షేత్రం సంగమేశ్వర ఆలయం వద్ద ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో కృష్ణానది అనుసంధానంగా ఉన్న సప్త నదుల సంగమ క్షేత్రంలో రెండు పుష్కర నదులైన కృష్ణవేణి తుంగభద్ర నదుల మధ్య సరస్వతీ నది అంతర్వాహినిగా ప్రవహిస్తుందని నమ్మకంతో ఆదివారం తెలంగాణ ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి సోమశిల కృష్ణానది మీదుగా సంగమేశ్వర ఆలయానికి చేరుకున్న భక్తులు ఒకవైపు మరో వైపు ఆంధ్ర, ఒంగోలు, బాపట్ల, కడప, ప్రొద్దుటూరు, మచిలీపట్నం, విజయవాడ, బళ్లారి నుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి ఆలయంలో ఉన్న వేపదార శివలింగాన్ని దర్శించుకున్నారు. సరస్వతీ నది పుష్కరాలలో ఆదివారం 11వ రోజు రేపటితో 12 రోజుల పుష్కరాలు ముగుస్తాయి. దీంతో తెలంగాణ రాయలసీమ, ఆంధ్ర సుదూర ప్రాంతాల నుంచి భక్తులు సంగమేశ్వర ఆలయాన్ని దర్శించుకోవడంతో పాటు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారని ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామయ్య శర్మ తెలిపారు.

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి

పెద్దకొత్తపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి) : మేతకు వెళ్లిన గొర్రెలు ప్రమాదవశాత్తున తెగి నేలపై పడి ఉన్న విద్యుత్ తీగలకు తాకి మూడు గొర్రెలు ఆదివారం మృతి చెందాయి. ఈ ప్రమాదం కొల్లాపూర్ మండలం అంకిరావుపల్లి శివారులో చోటు చేసుకుంది. బాధితుడు పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి ఎల్లయ్య రోజు వారీగా తన గొర్రెలను మేతకు ఆదివారం అంకిరావుపల్లి శివారులోని పంట పొలాలకు తీసకెళ్లాడు. సదరు పంట పొలంలో వీచిన బలమైన గాలులకు విద్యుత్ తీగలు తెగి నేలపై పడ్డాయి. ఇది గమనించని ఎల్లయ్య గొర్రెలను అటుగా తీసుకెళ్లాడు. దీంతో మందలోని మూడు గొర్రెలు ప్రమాదవశాత్తు వెళ్లి విద్యుత్ తీగలను తాకడంతో అక్కడికక్కడే చనిపోయాయి. రూ.45వేల నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు. తాను గొర్రెల పెంపకంపైనే ఆధారపడి జీవిస్తున్నామని, ప్రభుత్వం పరిహారం ఇప్పించి ఆదుకోవాలని కాపరి ఎల్లయ్య కోరారు.

దామాషా పద్ధతిలో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

- రాష్ట్ర అధ్యక్షుడు వెంకటయాదవ్
- యాదవుల విద్యకు తొలి ప్రాధాన్యమివ్వాలని పిలుపు

గద్వాల టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణనను సత్వరం పూర్తిచేసి బీసీలకు దామాషా పద్ధతిలో రిజర్వేషన్లు అమలుచేయాలని యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకటయాదవ్ కోరారు. యాదవ కులబాంధవులు విద్యకు తొలి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా అన్నిరంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని లోపాముద్ర పాఠశాలలో యాదవ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో రాజకీయ, చైతన్య అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో మాట్లాడిన వెంకటయాదవ్, స్వాతంత్ర్యానికి ముందునుంచి నేటి వరకు విద్యలో వెనుకబడి ఉండటం వల్లే యాదవులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అనుకున్న స్థాయిలో రాణించలేక పోతుండటం విచారకరమన్నారు. యాదవులను విద్యాపరంగా చైతన్యం చేయడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే త్వరలోనే హైదరాబాద్‌లో యాదవ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఉన్నత విద్య అవకాశాల కోసం గ్రంథాలయం ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈసందర్భంగా సమకాలీన రాజకీయాలు, యాదవుల పాత్ర, కులసంఘాల స్వతంత్రత-ప్రాధాన్యత, యాదవ సమాజంలో మూఢనమ్మకాలు, బాల్యవివాహాలు అనే అంశంపై డాక్టర్ బైకాని బాలుయాదవ్, జుర్రు నారాయణ యాదవ్, 'భూ భారతి' అనే అంశంపై వై.రవి కుమార్ యాదవ్, 'ఆధునిక పద్ధతుల్లో గొర్రెల పెంపకం' అనే అంశంపై పాలమూరు జిల్లా అధ్యక్షుడు అంజన్న యాదవ్ కీలక ఉపన్యాసం చేశారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బండల వెంకట్రాములు, విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి హనిమూని మహేంద్రయాదవ్, గద్వాల యాదవ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కావలి నరసింహులు, మాజీ కౌన్సిలర్లు భాస్కర్‌యాదవ్, నాగేంద్రయాదవ్, తుమ్మల నర్సింహులు యాదవ్, మోహన్, రవిశంకర్, వెంకటేశ్, రామకృష్ణ, శ్రీనివాసులు ఉన్నారు. ఈసందర్భంగా ఇటీవల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన నర్సింహులును యాదవ సంఘం నాయకులు సన్మానించారు.

పీఎఫ్ ఉన్నా.. పింఛన్ రాక

పదేళ్లుగా అవస్థలు

- అర్హులైన బీడీ కార్మికులకు అందని జీవన భృతి
- ఉమ్మడి జిల్లాలో 50వేల మంది బీడీ కార్మికులు



అమరచింతలో బీడీలు చుడుతున్న మహిళలు

(5వ పేజీ తరువాయి..)

అందలేదు. కనీసం ఆన్‌లైన్ సైట్ ఓపెన్ కాని పరిస్థితి ఏర్పడింది. వామపక్ష ప్రజా సంఘాల పోరాటాల ఫలితంగా రాష్ట్రంలోని ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్‌లాంటి జిల్లాలో అక్కడి ఉన్నతాధికారులు ఆన్‌లైన్ సైట్ ఓపెన్ చేసి అర్హులతో దరఖాస్తులు తీసుకోవడంతో పాటు క్షేత్రస్థాయిలో సర్వేచేసి అర్హులు లేని బీడీ కార్మిక పింఛన్‌దారులను తొలగించిన సందర్భాలు ఉన్నాయి. ఒక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే 2015 తరువాత నేటి వరకు ఉమ్మడి జిల్లా ఉన్నతాధికారులు ఆన్‌లైన్ సైట్ ఓపెన్ చేయలేదు. కనీసం బీడీ వృత్తిలో లేకుండా పింఛన్ పొందుతున్న వారిని కూడా తొలగించకపోవడంతో బీడీ కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బీడీ కార్మికులు 50వేల మంది దాకా ఉండవచ్చునని అంచనా.. ఒకప్పుడు కార్మికుల వాటా పీఎఫ్ కట్టి, యజమానుల వాటా సగం పీఎఫ్ కట్టకపోవడంతో పింఛన్లు రాకుండా ఉండేవి. ప్రస్తుత యజమానులు, కార్మికులు ఇద్దరు కలిసి పీఎఫ్ కడుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ సైట్ బంద్ చేయడం వల్ల అర్హులు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునే పరిస్థితి లేకుండా పోయింది.



బీడీలు చుడుతున్న మహిళలు

పదేళ్లుగా ఆన్‌లైన్ ఓపెన్ కావడం లేదు



పీఎఫ్ పొందిన బీడీ కార్మికులు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని చూస్తే 10 సంవత్సరాలుగా సైట్ ఓపెన్ కావడం లేదు. వేలాది మంది బీడీ కార్మికులు పీఎఫ్ ఉండి కూడా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకో లేని పరిస్థితిలో ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా నేటికీ ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం పట్ల కార్మికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సీఐటీయూ పోరాటాల ఫలితంగా కొన్ని జిల్లాల్లో ఆన్‌లైన్ సైట్ ఓపెన్ చేసినా.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలతో పాటు మరి కొన్ని జిల్లాల్లో ఆన్‌లైన్ ఓపెన్ చేయకపోవడం దురదృష్టకరం. ఇప్పటికైనా ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించి కార్మికులకు న్యాయం చేయాలి.

- ఆర్ఎన్ రమేష్, తెలంగాణ బీడీ అండ్ సిగర్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

బీడీ కార్మికులపై చిన్న చూపు



ప్రభుత్వాలు ఎన్ని మారినా కష్టపడి పని చేసుకుంటున్న తమ లాంటి బీడీ కార్మికులపై చిన్న చూపు చూస్తున్నారు. 30ఏళ్లకు పైగా బీడీ వృత్తిలో ఉన్న తాము అప్పటి లాగానే కొనసాగు తున్నాం. తమ కార్మికుల్లో మార్పు రావడం లేదు. అర్హులకు కార్మికులకు ఎప్పటికైనా పింఛన్ సౌకర్యం కల్పించాలి.

- చిన్న లక్ష్మన్న, బీడీ కార్మికుడు, అమరచింత

అర్హులకు పింఛన్లు ఇవ్వాలి



అర్హులైన బీడీ కార్మికులకు ప్రభుత్వం తక్షణమే పింఛన్లు అందించాలి. బీడీ వృత్తికి సంబంధం లేని వారికి పింఛన్లు ఇవ్వరాదు. పది సంవత్సరాలుగా ప్రభుత్వం పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఆన్‌లైన్ సైట్ ఓపెన్ చేయడం లేదు. తక్షణమే సైట్ ఓపెన్ చేసి అరువులచే దరఖాస్తు తీసుకోవాలి.

- సరోజ, బీడీ కార్మికురాలు, మస్తీపూర్ గ్రామం, అమరచింత మండలం, వనపర్తి

చెత్త సమస్యకు చెక్

- ప్రత్యేక యాప్ రూపొందిస్తున్న ప్రభుత్వం
- శాశ్వత పరిష్కారం కోసం స్వచ్ఛదనం పేరుతో కొత్త ఆప్షన్
- చెత్త సేకరణ, డంపింగ్ యార్డుకు తరలించే ప్రక్రియపై నిఘా
- ఈనెల చివరలో అందుబాటులోకి రానున్న యాప్


నవాబ్‌పేట మండలం కాకర్లపాడ్‌లో చెత్తయార్డును పరిశీలిస్తున్న ఎంపీఈవో

మహబూబ్‌నగర్ న్యూటౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో చెత్త సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు సంయుక్తంగా పకడ్బందీ చర్యలు చేపట్టబోతున్నాయి. గ్రామ పంచాయతీల్లో నిర్వహించే పారిశుధ్య కార్యక్రమాలను ప్రభుత్వం రూపొందించే యాప్ ద్వారా అధికారులు పర్యవేక్షణ చేయనున్నారు. ఏ గ్రామంలో ఎంత చెత్త సేకరణ చేస్తున్నారు... సేకరించిన చెత్తను ఏం చేస్తున్నారు... చెత్తను కాలుస్తున్నారా, డంపింగ్ యార్డులో డంప్ చేస్తున్నారా, లేక రోడ్డు పక్కన గోతులలో పడేస్తున్నారా అని తెలుసుకునేందుకు పీఎస్ యాప్‌లో కొత్తగా స్వచ్ఛదనం అనే ఆప్షన్ చేర్చి పర్యవేక్షణ చేయనున్నారు. ఈ యాప్ ఈ నెల చివరన అందుబాటులోకి రానున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

● ఇష్టమొచ్చిన చోట డంపింగ్‌కు యాప్‌తో చెక్

గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు ఎన్ని చర్యలు చేపట్టినా చాలా పంచాయతీలలో చెత్త సేకరణ నత్తనడకన సాగుతున్నది. సేకరించిన చెత్తను ఇష్టమొచ్చిన చోట డంప్ చేస్తున్నారు. ఆ చెత్తకు నిప్పు పెట్టడంతో గాలిలో కాలుష్యం అవుతున్నది. వర్షాకాలంలో చెత్తలో గ్రామాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డంపింగ్ యార్డులు ఉన్నప్పటికీ అక్కడకి తరలించలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం ఈ యాప్‌ను రూపొందించినట్లు తెలుస్తున్నది. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టడం కోసమే శాఖల మధ్య సమన్వయం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు ఈ యాప్ ద్వారా చెత్తను ఇష్టమొచ్చిన చోట డంప్ చేయకుండా చెక్ పెట్టనున్నారు.

● యాప్‌లో కొత్త ఆప్షన్ స్వచ్ఛదనం

గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణకు ఇప్పటికే యాప్ ఉంది. పంచాయతీ కార్యదర్శులకు మొబైల్ పీఎస్ యాప్‌ను రూపొందించారు. ఈ యాప్‌కు స్వచ్ఛదనం అనే నామకరణం చేశారు. యాప్‌లో రోజువారిగా చెత్త సేకరణ వివరాలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలి. ప్రభుత్వం నిబంధనల ప్రకారం.. ప్రతిరోజు గ్రామంలో నిర్వహించే పారిశుధ్య పనుల వివరాలను కార్యదర్శులు ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నప్పటికీ పారిశుధ్యంలో కొంత నిర్లక్ష్యం జరుగతుందనే విమర్శలు లేకపోలేదు. దీని దృష్ట్యా ఇదే యాప్‌లో కొత్త ఆప్షన్‌ను అందుబాటులోకి తీసుకరానుంది. వేస్ట్ కలెక్షన్ మేనేజ్‌మెంట్ కోసం అదనంగా (స్వచ్ఛదనం) అనే ఆప్షన్‌ను చేర్చారు. ఇందులో ప్రతిరోజు ఎంత చెత్త పోగైంది. అందులో తడి, పొడి చెత్త వంటి సమాచారాన్ని పంచాయతీ కార్యదర్శుల ఆప్‌లోడ్ చేయనున్నారు.

చెత్త సేకరణకు త్వరలో యాప్



రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో చెత్త సేకరణకు ప్రత్యేక యాప్‌ను రూపొందించనుంది. యాప్ ఈ నెల చివరి కల్లా గ్రామాల్లో అమల్లోకి రానుంది. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో ఈ యాప్‌పై అధికారులు సమీక్ష నిర్వహించారు. జిల్లా అధికారులతో కూడా వీసీలలో పలు సూచనలు చేస్తున్నారు. ఈ యాప్ అమలులో పంచాయతీ కార్యదర్శులు. ఎంపీవోలు ముఖ్య భూమికను పోషించనున్నారు.

\- డీపీవో పార్థసారథి

కేజీబీవీల్లో మెరుగైన విద్య

- ప్రారంభమైన ప్రవేశాలు


కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం

వనపర్తి విద్యావిభాగం, మే 25 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుపేదలు, తల్లిదండ్రి లేని అనాథలు, పేదరికంలో అర్ధాంతరంగా చదువుకు దూరమైన విద్యార్థులకు బాసటగా నిలిచేందుకు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వసతి, నైపుణ్య శిక్షణలోను నేర్పిస్తున్నారు. 2005లో ఏర్పడిన ఈ పాఠశాలలకు మొదట్లో ఆదరణ అంతంత మాత్రంగానే ఉన్నా నేడు పాఠశాలలో ప్రవేశాల కోసం పోటీ పెరిగింది. మొదట్లో ఈ పాఠశాలలో 6-10వ తరగతి వరకు మాత్రమే విద్యను అందించేవారు. 2018 నుంచి కేజీబీవీలో ఇంటర్ విద్యను సైతం ప్రవేశ పెట్టారు. 6 నుంచి ఇంటర్ వరకు ఇంగ్లీష్ మీడియంలోనే బోధిస్తున్నారు.

మెరుగైన ఫలితాలు.. పెరుగుతున్న పోటీ

వనపర్తి జిల్లాలో 14 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు ఉన్నాయి. గతంలో ఐదు కేజీబీవీలలో మాత్రమే ఇంటర్ వరకు తరగతులు నిర్వహిస్తుండగా 2025-26 నుంచి ఘణపూర్, పాన్‌గల్, మదనాపూర్, కొత్తకోట, చిన్నంబావి, రేవల్లి, కేజీబీవీలను ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేశారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి , ఇంటర్ ఫలితాలలో కేజీబీవీ విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించడంతో పాటు 91 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఒక్కో కేజీబీవీలో 6వ తరగతికి 40 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఒక్కో గ్రూపునకు 40 సీట్లలో ప్రవేశం పొందడానికి అవకాశం ఉంది. ఇప్పటికే ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది.

విద్యతో పాటు నైపుణ్యాలలోనూ శిక్షణ

పేదింటి విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో మెరుగైన విద్యను అందిస్తున్నాం. విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, మానసిక వికాసంపై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఇటీవల విడుదలైన పది, ఇంటర్ ఫలితాల్లోను కేజీబీవీ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. నిరుపేద విద్యార్థులకు కేజీబీవీలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

\- జీసీడీవో సుబ్బలక్ష్మి

● ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు దీటుగా ఓ వైపు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో , కళాశాలల్లో ప్రవేశాల సంఖ్య పెంచాలని చెబుతోంది. మరోవైపు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో మాత్రం సీట్లు దొరకడం లేదంటూ విద్యార్థులు వాపోతున్నారు.

బాలికల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తున్నాం



కేజీబీవీలోని బాలికలకు చదువుతో పాటు ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తున్నాం. పాఠశాల స్థాయిలోనే ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపట్టి, విద్యార్థులకు జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేలా తీర్చిదిద్దుతున్నాం. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా ప్రోత్సహిస్తున్నాం.

\- డీఈవో అబ్దుల్ ఘని

ప్రవేశాల కోసం నిరుపేద విద్యార్థుల పోటీ పెరగడంతో కేజీబీవీలో మెరుగైన వసతులు కల్పించి సీట్ల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

క్రైం కార్నర్

చిరుత దాడిలో మేక మృతి


చిరుత దాడిలో మృతి చెందిన మేక

కోయిలకొండ, మే 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం వెనుక చాకలి కృష్ణయ్య ఇంటిలో ఉన్న మేకలపై చిరుత దాడి చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆదివారం తెల్లవారు జామున ఇంటిలో ఉన్న మేకల మందపై చిరుత దాడి చేసి కొండపై ఎత్తికెళ్లి మాంసం ఆరగించినట్లు బాధిత రైతు తెలిపారు. గత ఐదు రోజులుగా కోయిలకొండ కొండలపై చిరుతలు అవాస ప్రాంతాలుగా మార్చుకున్నాయని, గ్రామంలోకి వచ్చి ఆవుదూడలు, మేకలు, కుక్కలను ఎత్తుకెళ్తున్నాయని, అయినా అటవీ అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కేటీదొడ్డి, మే 25 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్న సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధరూర్ మండల కేంద్రానికి చెందిన ఎరుకలి వెంకటేష్, ఉరుకుందు ఎలాంటి అనుమతులు లేకుండా గద్వాల నుంచి రాయచూరుకు బొలెరో వాహనంలో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా ఆదివారం తెల్లవారుజామున నందిన్నె చెక్‌పోస్ట్ దగ్గర పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బొలెరో వాహనాన్ని తనిఖీ చేసి పట్టుకున్నామన్నారు. రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి 30 క్వింటాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని వెంకటేష్, ఉరుకుందులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

ఏడుగురిపై కేసు నమోదు

గద్వాల క్రైం, మే 25 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలను నడిపితే చర్యలు తప్పవని పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని కృష్ణవేణిచౌరస్తా సమీపంలో మద్యం సేవించి వాహనాలను నడుపుతున్న ఏడుగురు వాహనదారులపై కేసులు నమోదు చేశారు.

దొంగతనం కేసులో రిమాండ్

తిమ్మాజిపేట, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో దొంగతనం చేసిన వ్యక్తులపై ఆదివారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. స్థానిక ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అంబేడ్కర్ చౌరస్తాలో రాజస్థాన్‌కు చెందిన రాంలాల్ అనే వ్యక్తి టీ కొట్టును పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. టీ కొట్టుకు ఎప్పటిలాగే తాళం వేసి రాత్రి ఇంటికెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఈ నెల 23న తాళం పగలగొట్టి వస్తువులు తీసుకెళ్లినట్లు యజమాని రాంలాల్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కానిస్టేబుల్ నరసింహ, మల్లేష్ సీసీ కెమెరా సహాయంతో విచారణ చేపట్టి గుర్తించిన నలుగురిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించారు. ఇద్దరు మైనర్లు కాగా మరో ఇద్దరు గతంలోనూ దొంగతనాలు చేశారని, ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

అలంపూరుచౌరస్తా, మే 25 (ఆంధ్రజ్యోతి): శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు అయినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. కర్నూలు జిల్లా నందవరం మండలం కనకవీడు గ్రామానికి చెందిన బోయ నారాయణ (75) అంతర్రాష్ట్ర రహదారిపై నడిచి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం అజాగ్రత్తగా తన తండ్రిని ఢీ కొందని కుమారుడు రంగడు ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వాహనం ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

వడ్డేపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొంకల గ్రామానికి చెందిన వివాహిత సునీల(25) ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ నాగశేఖర్ రెడ్డి తెలిపారు. కుటుంబంలో ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆత్మహత్య చేసుకుందని, మృతురాలి తల్లి ఎర్రక్క ఫిర్యాదు మేరకు భర్త, అత్త, మామలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి ఐదు నెలల బాలుడు ఉన్నారు.

కట్టెలు ఏరుకునేందుకు వెళ్లి..

విద్యుదాఘాతంతో రైతు మృతి


బోయ భీమన్న (ఫైల్)

చిన్నచింతకుంట, మే 25 (ఆంధ్రజ్యోతి): వంట చెరుకు కోసం కట్టెలు ఏరుకునేందుకు వెళ్లిన ఓ రైతు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని చిన్న వడ్డేమాన్ శివారులో ఆదివారం ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ రాంలాల్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నవడ్డేమాన్ గ్రామానికి చెందిన రైతు బోయ భీమన్న (50) ఆదివారం మరికొందరితో కలిసి వంట చెరుకు కోసం కట్టెలు ఏరుకునేందుకు గ్రామ శివారులోని పొలానికి వెళ్లాడు. అక్కడ కట్టెలు ఏరుతుండగా, తెగిపడిన విద్యుత్ తీగకు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. పక్కనున్న వారు అతడిని కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. పోలీసులకు సమాచారం అందడంతో వారు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య చిట్టెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దున్నే వాడికే భూమి హక్కులు దక్కాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ


వెనికితండాలో గిరిజన రైతులతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

ఖిల్లాఘణపురం, మే 25 (ఆంధ్రజ్యోతి) : భూములు సాగు చేసి దున్నేవాడికే భూమి హక్కులు దక్కాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని మామిడిమాడ, షాపూర్ శివారు ప్రాంతాల్లో తరతరాలుగా గిరిజన రైతులు సాగు చేస్తున్న భూములను ఆదివారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పరిశీలించి నిరుపేద గిరిజన రైతులకు అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. మండలంలోని మామిడిమాడ, షాపూర్, వెనికితండా, కర్నె తండా, మేడి బావి తండా, ఆముదం బండతండా, ముందరి తండా, భీముడి తండా, మీట్య తండా, బక్క తండా, రెవెన్యూ శివారులోని సర్వే నెంబర్లు 366 నుంచి 412 వరకు, సర్వే నెంబర్ 414లలో ఉన్న 461 ఎకరాల ఖుష్కి భూములను గిరిజన రైతులు తరతరాలుగా పంట సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారని గుర్తు చేశారు. ఇట్టి భూములు ప్రస్తుతం రాజా శ్యామ్ శంకర్ బహదూర్, రాజామోహన్ బహదూర్‌ల పేర్లపై ఉన్నాయని, వారి కులం ఓసీ అయిన ఎస్టీగా తప్పుగా నమోదు చేసి రెవెన్యూ పత్రాలు సృష్టించారని అన్నారు. సీలింగ్ చట్టాలు వచ్చిన నేటికీ ఒక వ్యక్తిపై పట్టాదార్ ఖాతా నెంబర్ 339లో ఒక వ్యక్తి పేరుపై 400 ఎకరాల భూమి ఉండటంతో చట్ట విరుద్ధమన్నారు. బహదూర్ పేర్లపై ఉన్న భూముల పట్టాలను రద్దు చేసి గిరిజన రైతులకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలోని జిల్లా కలెక్టర్లు శ్వేతా మహంతి, షేక్ యాస్మిన్ బాషాలు సీసీఎల్ఏకు సిఫారసు చేసిన గిరిజన రైతులకు పట్టాలు ఇవ్వలేకపోయారని వాపోయారు. సాగు చేస్తున్న భూములపై గిరిజన రైతులకు హక్కులు కల్పించకపోతే, అమాయక ప్రజలను మోసం చేస్తే భూ సాధన కమిటీ సభ్యులు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘాలు ఆందోళనలు పోరాటాలు చేయడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు, భూ పోరాటాల సాధన కమిటీ కన్వీనర్ సక్రు నాయక్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పరమేశ్వర చారి, ఐద్వా జిల్లా కార్యదర్శి లక్ష్మి, నాయకులు జయమ్మ, కృష్ణ, భరత్, దాసు, శ్రీను, లక్ష్మణ్ నాయక్, రాజి, మన్నె, మద్దిలేటి, గిరిజన రైతులు తదితరులు పాల్గొన్నారు.

250 మందితో సకుటుంబ ఆత్మీయ సమ్మేళనం


సకుటుంబ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 250 మంది సభ్యులు

కొత్తకోట, మే 25 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణానికి చెందిన ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు పబ్బ నరేందర్ గౌడ్, ఉపాధ్యాయుడు శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో వారి రక్త సంబంధీకులు 250 మందితో సకుటుంబ ఆత్మీయ సమ్మేళనం కొత్తకోటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరుపుకున్నారు. సత్యమ్మ, నాగన్నగౌడ్‌లకు చెందిన తొమ్మిది మంది సంతానానికి చెందిన 80 జంటలతో మొత్తం 250 మంది కుటుంబ వివిధ నగరాలు, గ్రామాల్లో నివాసం ఉంటున్నామన్నారు. బంధువులు, పిల్లలకు కుటుంబ ప్రాధాన్యత విలువలను తెలుపుకుంటూ సంతోషం పొందారు. వయస్సు పైబడిన కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి దోహద పడిన జంటలను శాలువాలతో సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ఆటవిడుపుగా యువకులు, పిల్లలు ఆటలు, నృత్యాలు అలరించాయి. ఒకరికొకరు బహుమతులు ఇచ్చిపుచ్చుకున్నారు.

భూ పరిహారం ఇవ్వాలి

- ఎంపీ అరుణకు రైతుల వినతి


ఎంపీ డీకే అరుణకు వినతి పత్రం అందజేస్తున్న కాట్రేపల్లి గ్రామస్థులు

మరికల్, మే 25 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతులకు బహిరంగ మార్కెట్ ప్రకారం ఎకరాకు రూ.70 లక్షల పరిహారం అందించాలని ఎంపీ డీకే అరుణను కోరారు. ఈ సందర్భంగా మక్తల్ మండలం కాట్రేపల్లి గ్రామ రైతులు ఎంపీకి వినతి పత్రం సమర్పించారు. మండలంలో సుమారు 300 ఎకరాలు రైతులు నష్టపోతున్నామని ఎంపీకి వివరించారు. వెంటనే స్పందించిన ఎంపీ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి రైతులు నష్టపోకుండా మార్కెట్ ధర ప్రకారం భూములు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇదిలా ఉండగా, ప్రధానమంత్రి చేపట్టిన మన్‌కీబాత్ కార్యక్రమంలో ఎంపీ డీకే అరుణ పాల్గొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ అధికార ప్రతినిధి చిన్న నర్సన్‌గౌడ్ స్వగృహంలో ఏర్పాటు చేసిన మన్‌కీబాత్‌ను తిలకించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు నాగూరావు నామాజీ, రతంగ్‌పాండురెడ్డి, జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్, మండల అధ్యక్షుడు వేణు, ఉపాధ్యక్షుడు రమేష్, శెట్టి మహేందర్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 25 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా అథ్లెటిక్స్ అండర్-8,10,12 బాల, బాలికల జట్ల ఎంపికలను సోమవారం జిల్లా స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ధ్రువపత్రాలతో ఉదయం 10 గంటలకు రిపోర్టు చేయాలని కోరారు. ఎంపికైన జట్టు సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో జూన్ 1న నిర్వ హించనున్న 11వ తెలంగాణ సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ టోర్నీలో పాల్గొంటుందని తెలిపారు.

చిన్నారుల అంత్యక్రియలు

గోపాల్‌పేట, మే 25(ఆంధ్రజ్యోతి) : నీటి కుంటలో పడి మృతి చెందిన లిల్లి (10), గణేష్ (8)కు ఆదివారం మధ్యాహ్నం కుటుంబ సభ్యుల గ్రామస్థుల రోదనలతో అంత్యక్రియలు నిర్వహించారు. కొన్ని నెలల క్రితం తండ్రి గగనం వెంకటయ్య చెట్టు మీద నుంచి పడి మృతి చెందినప్పటి నుంచి తల్లి మణెమ్మకు తోడుగా మేకలను పెంచి అమ్ముతుండేవారు. రోజు లాగే మేకలను వేసుకుని లిల్లి, గణేష్ గ్రామ శివారులో ఉన్న పొలాల దిక్కు వెళ్లి మేపుకుంటున్నారు. శనివారం మధ్యాహ్నం చెట్టుకింద అక్క తమ్ముడు భోజనం చేశారు. గ్రామ శివారులో ఉన్న కుంటలో అక్క తమ్ముడు ఈతపడుతూ ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందారు.

బైక్ పైనుంచి పడి మహిళ మృతి

మక్తల్, మే 25 (ఆంధ్రజ్యోతి) : బైక్ పైనుంచి పడి మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై భాగ్యలక్ష్మీరెడ్డి కథనం మేరకు క్రిష్ణ మండలం గుడెబల్లూర్ గ్రామానికి చెందిన పార్వతమ్మ(43) తన పుట్టిన ఊరు మక్తల్ పట్టణంలో జరిగిన ఓ శుభకార్యంలో పాల్గొని తిరిగి గ్రామానికి తన తమ్ముడు తిమ్మప్పతో కలిసి ద్విక్ర వాహనంపై వెళుతుండగా ఓ కుక్క అడ్డుగా రావడంతో తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి కిందపడింది. ఈ సంఘటనలో పార్వతమ్మ తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. తిమ్మప్పకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

2డే లీగ్‌లో మహబూబ్‌నగర్ జోరు

- తొలి ఇన్నింగ్స్‌లో 125 పరుగులకు నాగర్‌కర్నూల్ ఆలౌట్
- బౌలింగ్‌లో చెలరేగిన ముఖీద్, శ్రీకాంత్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎండీసీఏ ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అండర్-23 ఉమ్మడిజిల్లా 2డే లీగ్ టోర్నీ ఉత్సాహంగా కొనసాగుతున్నది. ఆదివారం జిల్లా కేంద్రంలోని సమర్థ పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 2డే క్రికెట్ లీగ్ 3వ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన నాగర్‌కర్నూల్ జట్టు 37.5 ఓవర్లలో 125 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో కేతేశ్వర్ 86 బంతుల్లో 11 ఫోర్లతో అర్ధసెంచరీ(65) సాధించాడు. నిరంజన్ 26 పరుగులు చేశాడు. మహబూబ్‌నగర్ బౌలర్లలో ముఖీద్ 4, కే.శ్రీకాంత్ 4 వికెట్లు తీసి నాగర్ కర్నూల్ జట్టును తక్కువ స్కోర్‌కే కట్టడి చేశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన మహబూబ్‌నగర్ జట్టు 22 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది. వర్షం కారణంగా మ్యాచ్ నిలిచింది. జట్టులో ఎ.శ్రీకాంత్ 72 బంతుల్లో 11 ఫోర్లతో 65 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు.

క్రీడాకారులు ప్రతిభ చాటాలి

టోర్నీలో క్రీడాకారులు ప్రతిభ చాటాలని జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సమర్థ పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న 2డే లీగ్ టోర్నీలో మహబూబ్‌నగర్-నాగర్‌కర్నూల్ మ్యాచ్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం హెచ్‌సీఏ ఉమ్మడి జిల్లా 2డే లీగ్‌కు నిర్వహణకు అవకాశం కల్పిందన్నారు. జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కోచ్ అబ్దుల్లా, సీనియర్ క్రీడాకారులు మన్నాన్, అబిద్ పాల్గొన్నారు.

జిల్లాలో అత్యపత్య క్రీడాభివృద్ధికి కృషి

- జిల్లా నూతన కార్యవర్గ ప్రతినిధులు



నూతనంగా ఎన్నికైన జిల్లా అత్యపత్య అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

మహబూబ్‌నగర్‌స్పోర్ట్స్, మే 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అత్యపత్య క్రీడాభివృద్ధికి కృషి చేస్తామని జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులు నాసర్ మొహియొద్దీన్, ముంతాజ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇండో స్టేడియంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా డీఎస్ఏ కోచ్ సయ్యద్ అంజద్, అత్యపత్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముఖేష్ వ్యవహరించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గప్రతినిధులు మాట్లాడుతూ కలిసి కట్టుగా పని చేసి అత్యపత్య క్రీడలో రాణించేలా గ్రామీణ, పట్టణ క్రీడాకారులను ప్రోత్సహిస్తామని తెలిపారు. జిల్లా అత్యపత్య అధ్యక్ష, కార్యదర్శులు మొహియొద్దీన్, మహ్మద్ ముంతాజ్, కోశాధికారిగా జగదీశ్వరి, జాయింట్ సెక్రటరీలుగా మహ్మద్ ఉస్మాన్, గులాం అఫ్రోజ్, జగన్‌ప్రసాద్, అహ్మద్ హుస్సేన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవికుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ప్రదీప్‌కుమార్, షేక్‌సైఫ్ ఎన్నికయ్యారు.

ఇంటర్వ్యూ..

రైతులు లోతు దుక్కులు దున్నుకుని పెట్టుకోవాలి

- నరేశ్, వ్యవసాయ అధికారి, బల్మూరు



బల్మూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : రాబోయే వానాకాలానికి పంటలకుగాను రైతులు తమ వ్యవసాయ దుక్కులను లోతుగా దున్నుకుని పెట్టుకుంటే వానాకాలంలో మంచి దిగుబడిని ఇచ్చే వ్యవసాయ సాగు ఉంటుందని వ్యవసాయ అధికారి కావేటి నరేష్ తెలిపారు. ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

మండలంలో మొత్తం భూమి ఎంత, అందులో సాగు భూమి ఎంత?

మండలంలో మొత్తం భూమి 54,119 ఎకరాలు ఉంది. 35,990 రైతులు సాగు చేస్తున్నారు.

వేసవిలో సాగు చేస్తున్న పంటలకు రైతులు తీసుకోవాల్సిన చర్యలేమిటీ?

ప్రస్తుతం యాసంగి పంటలు అన్ని కోతలు నడుస్తున్నాయి. అకాల వర్షాలు, వడగండ్ల వానలు ఉన్నాయి. కోతకు సిద్ధంగా ఉన్న పంటను త్వరగా కోత కోసి, పంట ఉత్పత్తులను తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

మండలంలో ఎంతమంది రైతులకు రైతు భరోసా వచ్చింది ?

మండలంలో సాగు చేస్తున్న రైతులకు 13,173 మంది రైతులకు రైతు భరోసా కింద పంట పెట్టుబడి సాయం అందింది.

రైతులకు ఏమైనా సూచనలు ఇస్తారా?

రైతు సోదరులు వానాకాలం సాగు కోసం తమ పంట పొలాలను లోతుగా దుక్కులను పొడిగా మారే విధంగా చేసుకోవాలి. లోతు దుక్కుల వల్ల చీడపీడల ఉధృతి తగ్గుతుంది. వర్షం నీటిని ఒడిసిపట్టే గుణం పెరుగుతుంది.

న్యూస్ బాక్స్

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్లయ్య మృతి



తెలకపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గౌరారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మల్లయ్య ఆదివారం మృతి చెందారు. పలువురు నాయకులు, ప్రజలు నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ బండ పర్వతాలు, సింగిల్ విండో వైస్ ప్రెసిడెంట్ మామిళ్లపల్లి యాదయ్య తదితరులు గౌరారం వెళ్లి మల్లయ్య భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. మల్లయ్య కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలు చేశారని వారు అన్నారు.

రేపు తిమ్మాజిపేటలో వైద్య శిబిరం

తిమ్మాజిపేట, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని హోలీ శాలెం చర్చిలో ఈనెల 27న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని చర్చి పాస్టర్ శివకుమార్ తెలిపారు. ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ ఓపు హైదరాబాద్ నుంచి ప్రత్యేక వైద్యులు వస్తారని తెలిపారు. ఉదయం 9:30 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5గంటల వరకు కొనసాగుతుందన్నారు. శిబిరంలో రక్త, బీపీ, షుగరు వంటి పరీక్షలు చేసి మందులు ఇస్తారని తెలిపారు. కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలు ఇస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో చర్చి చైర్మన్ దేవదాస్, అధ్యక్షుడు బాలరాజు, ప్రసాద్, విజయ్, రాహుల్, రవి, రాజు, కుమార్ పాల్గొన్నారు.

కల్వకుర్తి సబ్ డివిజన్ పరిధిలో అధికారుల ఫోన్ నెంబర్లు మార్పు

కల్వకుర్తి, మే 25 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖ అధికారులు ఫోన్ నెంబర్లతో పాటు సబ్‌స్టేషన్ల ఫోన్ నెంబర్లు మారినట్లు విద్యుత్ శాఖ ఏడీఈ శంకరయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఏడీఈ నెంబరు 8712470963,
ఏఈ: 8712470965,
కల్వకుర్తి సబ్ స్టేషన్ : 8712470985,
మార్చాల ఎస్ఎస్ : 8712470989,
గుండూరు ఎస్ఎస్ : 8712470986,
ఎల్లికల్ ఎస్ఎస్ : 8712470987,
తోటపల్లి ఎస్ఎస్ : 8712470988,
తాండ్రా ఎస్ఎస్ : 8712470993,
వెల్దండ ఏఈ : 8712470991,
వెల్దండ సబ్ స్టేషన్ : 8712470966,
రాచూర్ సబ్‌స్టేషన్ : 8712470995
చారకొండ ఏఈ : 8712470969,
జూపల్లి సబ్‌స్టేషన్ : 8712470991,
సిర్సనగండ్ల ఎస్ఎస్ : 87124701005,
వంగూరు ఏఈ : 8712470967,
పోల్కంపల్లి సబ్ స్టేషన్ : 8712471002,
వంగూరు సబ్ స్టేషన్ : 8712471003,
నర్సారెడ్డిపల్లి సబ్ స్టేషన్ : 8712471004,
కొండారెడ్డిపల్లి సబ్ స్టేషన్ : 8712471031,
జాజాల సబ్ స్టేషన్ : 8712470994,
ఊర్కొండ ఏఈ : 8712470968,
మాదారం సబ్‌స్టేషన్ : 8712470997,
జకినాలపల్లి సబ్ స్టేషన్ : 8712470996

ఇకపై వినియోగదారులు ఈ నెంబర్లకు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

కరాటే విద్యార్థులకు బెల్టుల ప్రదానం

వెల్దండ, మే 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొట్ర గ్రామంలో వేసవి శిక్షణలో భాగంగా కరాటే విద్యార్థులకు ఆదివారం మాంక్స్ కరాటే అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు నాగరాజుగౌడ్ బెల్టులు ప్రదానం చేశారు. నీరటి కుమార్ విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం ప్రశంసనీయమని ఆయన పేర్కొన్నారు. కరాటే విద్య ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో నాగేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

చరిత్ర ఘనం... భవనం శిథిలం

- అధ్వానంగా శాఖా గ్రంథాలయం
- బడ్జెట్ లేక పేపర్లు, పుస్తకాలు కరువు
నిరాశతో వెనుదిరుగుతున్న పాఠకులు
- స్వీపరే గ్రంథాలయ అధికారి



మండల కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయం

కోడేరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఎంత చరిత్ర ఉన్న మండల పరిధిలోని శాఖా గ్రంథాలయం శిథిలావస్థకు చేరింది. ఈ భవనం ఇప్పుడో, అప్పుడో కూలేలా ఉంది. 1980లో కోడేరు గ్రామ యువకులు యువజన సంఘంగా ఏర్పడి గ్రామాభివృద్ధిపనులు చేసే వారు. ఈ క్రమంలో గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలనే ఉద్దేశ్యంతో చందాలు పోగుచేసి గ్రామీణ గ్రంథాలయంగా ఏర్పాటు చేశారు. ఓ వ్యక్తిని నియమించి నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. 1986లో శాఖా గ్రంథాలయంగా మారి జిల్లా గ్రంథాలయం ఆధ్వర్యంలో ఇక్కడికి అధికారిని నియమించి, కార్యక్రమాలు కొనసాగాయి. నాడు గ్రంథాలయంలో విద్యార్థులు, యువకులు, గ్రామ పెద్దలతో పాటు విశ్రాంత ఉద్యోగులు వార్త పత్రికలు ప్రతీ రోజు చదువుకునే వారు. విద్యార్థులు విజ్ఞానం పెంపొందించుకునేందుకు అవసరమయ్యే పుస్తకాలను ప్రతీ రోజు ఇంటికి తీసుకెళ్లి చదువుకొని ఒకటి రెండు రోజుల తర్వాత గ్రంథాలయంలో ఇచ్చి వేరే పుస్తకాలు తీసుకెళ్లేవారు. కొంత కాలం అలా నడిచింది. ఆ తర్వాత గ్రంథాలయ అధికారిని నియమించలేదు. గ్రంథాలయానికి బడ్జెట్ లేదనే నేపంతో వార్తా పత్రికలు, మాస పత్రికలు, పక్షపత్రికలు పూర్తిగా నిలిపేశారు. బడ్జెట్ సమస్య వల్ల ప్రస్తుతం మూడు దిన పత్రికలనే వేసుకోవడంతో, ఇతర పుస్తకాలు అందుబాటులో లేనందున పాఠకులు నిరాశతో వెనుదిరిగిపోతున్నారు.

పక్కా భవనం నిర్మించాలి



మండల కేంద్రంలో దాదాపు 45 సంవత్సరాల నుంచి కొనసాగుతున్న గ్రంథాలయ భవనం శిథిలావస్థలో ఉంది. ఎప్పుడు కూలి పోతుందో తెలియని పరిస్థితి. ఈ గ్రంథాలయంలో చదువుకున్న విద్యార్థులు ప్రస్తుతం వివిధ స్థాయి ఉన్నత హోదాల్లో ఉన్నారు. ఇక్కడ వచ్చే గ్రామస్థులకు, యువకులకు కనీసం వార్తా పత్రికలు కూడా లేకపోవడం విచారం. అందుకు ప్రజాప్రతినిధులు స్పందించి పక్కా భవనం నిర్మించి గ్రంథాలయాధికారిని నియమించాలి. వార్తా పత్రికలతో పాటు విజ్ఞానం పెంపొందించే పుస్తకాలను అందుబాటులో ఉంచాలి

-సాయిరామ్‌రెడ్డి, పాఠకుడు, కోడేరు

స్వీపరే గ్రంథాలయాధికారి

గ్రంథాలయానికి స్వీపరే గ్రంథాలయ అధికారిగా మారారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గ్రంథాలయానికి పక్కా భవనం నిర్మించి గ్రంథాలయ అధికారిని నియమించి దిన పత్రికలు, మాస పత్రికలు, విజ్ఞానం పెంపొందించే పుస్తకాలు అందుబాటులో ఉంచాలని గ్రామ పెద్దలు, యువకులు, విద్యార్థులు కోరుతున్నారు.



పేపరు చదువుతున్న పాఠకులు

108 అంబులెన్స్ సిబ్బంది నిజాయితీ



చెంచు మహిళకు పోగొట్టుకున్న వస్తువులు అందజేస్తున్న 108 అంబులెన్స్ సిబ్బంది

కొల్లాపూర్, మే 25 (ఆంధ్రజ్యోతి) : బంగారు మంగళసూత్రం, వెండి మెట్టెలు, విలువైన పత్రాలను తమ 108 వాహనంలో మరిచిపోయిన రోగులకు తిరిగి అందజేసి నిజాయితీని చాటుకున్న అంబులెన్స్ సిబ్బందిని కొల్లాపూర్ పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు. కొల్లాపూర్ మండలం అమరగిరి గ్రామానికి చెందిన చెంచు దేవమ్మ రెండు రోజుల క్రితం 108 అంబులెన్స్‌లో మంగళ సూత్రం, వెండి మెట్టెలు, విలువైన పత్రాలను మరిచిపోయింది. దేవమ్మ మనువడు అంజికి తేలు కరవడంతో 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హడావిడిలో వెంట తెచ్చుకున్న పర్సు అంబులెన్స్‌లో పెట్టి 108 వాహనంలో మరిచిపోయారు. నాలుగు , ఐదు రోజుల తరువాత అంబులెన్స్ సిబ్బంది వాహనంలో మరిచిపోయిన వాటిని గమనించి పర్సులో ఉన్న పత్రాలను చూసి విచారణ చేసి అమరగిరి వాసులుగా గుర్తించారు. ఆ గ్రామ పంచాయతీ సెక్రటరీ నాగరాజుకు, హోంగార్డు వెంకటేష్‌కు అంబులెన్స్ సిబ్బంది సమాచారం ఇవ్వడంతో చెంచు దేవమ్మకు సమాచారం అందించారు. జీవన ఉపాధి రీత్యా వారంతా నల్లమలలో ఉండగా నిన్న శనివారం వారు రావడంతో అంబులెన్స్ సిబ్బంది పైలెట్ నవీన్ కుమార్, ఈఎన్టీ మధు వారి వస్తువులను అప్పజెప్పి నిజాయితీని చాటుకున్నారు. పర్సులో ఉన్న మంగళసూత్రం, వెండి మెట్టెల కోసం చాలా వెతికాం కానీ దొరకలేదని, అంబులెన్స్ సిబ్బంది ఫోన్ చేసి చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నామని చెంచు దేవమ్మ తెలిపారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్

నాగర్‌కర్నూల్ టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ శానిటేషన్ కార్మి కులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను సంబంధిత కాంట్రాక్టర్ తక్షణమే చె ల్లించేలా జిల్లా ఉన్నతాధి కారులు చర్యలు తీసుకోవా లని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం కలెక్టరేట్ గేటు వద్ద శానిటేషన్ కార్మికులు నిర వధిక సమ్మె శిబిరాన్ని ఆర్.శ్రీనివాస్ సందర్శిం చి మద్దతు తెలిపా రు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ నుంచి నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని నాలుగు రోజులుగా అవుట్‌సోర్సింగ్ శానిటేషన్ కార్మికులు సమ్మె చేస్తున్నా ఉన్నతాధికారులు ఏమీపట్టనట్లు వ్యవహరించడం సమంజసం కాదన్నారు. అధికారులు ఒక నెల వేతనాలు ఇప్పించేందుకు చర్యలు చేపడతామని అధికారులు చెప్పడం సమంజసం కాదన్నారు. శానిటేషన్ కార్మికుల వేతనాల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, పెండింగ్ వేతనాలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. దీంతో కలెక్టరేట్ శానిటేషన్ కార్మికులు నాలుగు రోజులుగా చేపట్టిన నిరవధిక సమ్మెను విరమిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ శానిటేషన్ కార్మికులు రిజ్వాన్, నాగమణి, ఎల్లమ్మ, శ్రీదేవి, అలివేల, రేణుక, నాగయ్య, వెంకటేష్, కర్రెన్న పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే లక్ష్యాలను సాధిస్తాం

- ఘనంగా స్వేరోస్ విక్టరీ డే



స్వేరోస్ విక్టరీ డేలో పాల్గొన్న విద్యార్థులు

కల్వకుర్తి, మే 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినీ, విద్యార్థులు కష్టపడి చదివితేనే లక్ష్యాలను సాధిస్తారని స్వేరోస్ జిల్లా నాయకులు నగేష్, కృష్ణ, శివశంకర్ అన్నారు. మండలంలోని రఘుపతిపేట సమీపాన రామగిరి గుట్టపై స్వేరోస్ చిన్నారులు స్వేరోస్ జెండాలతో పాటు జాతీయ జెండాలను ఎగురవేసి స్వేరోస్ విక్టరీ డేను జరుపుకున్నారు. డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కృషి ఫలితంగానే గురుకు లాల్లో వినూత్న మార్పులు చేరుకుని ఎంతో మంది ఉన్నతంగా ఎదిగారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ధర్మ రాజు, రాము, శేఖర్, సంపత్ కుమార్, సాగర్, పరమేశ్వర్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన పగిడాల శ్రీనివాస్

కోడేరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జనుంపల్లి గ్రామానికి చెందిన మత్స్యకారుల సొసైటీ మెంబర్ వెంకటస్వామి మరణించడంతో వారి కుటుంబాన్ని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ పగిడాల శ్రీనివాస్ పరామర్శించి వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. ఆదివారం వెంకటస్వామి మరణించిన సమాచారం తెలుసుకున్న శ్రీనివాస్ గ్రామాన్ని సందర్శించి వారి కుటుంబాన్ని ఓదార్చి భౌతికకాయంపై పూలదండలు వేసి నివాళులర్పించారు. నాయకులు ఓర్సు రామకృష్ణ, గొడుగు స్వామి తదితరులు పాల్గొన్నారు.

మన్ కీ బాత్‌ను వీక్షించిన బీజేపీ శ్రేణులు

వంగూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రంగాపూర్‌లో ఆదివారం మోదీ ప్రసంగిస్తున్న మన్‌కీ బాత్ ప్రోగ్రామ్‌ను టీవీలో బీజేపీ శ్రేణులు వీక్షించారు. మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధాని మోదీ ఎంతో చక్కగా మాట్లాడారని బీజేపీ శ్రేణులు పేర్కొన్నారు. కార్యక్రమంలో తిరుపతయ్య, శంకరయ్య, మల్లేష్, గోవిందు, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల్లో శాకాహార ర్యాలీ



శాకాహారం ర్యాలీ నిర్వహిస్తున్న పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ సభ్యులు

ఊర్కొండ, మే 25 (ఆంధ్రజ్యోతి) : మనిషి శాకాహారం అలవాటు చేసుకోవాలని ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి అన్నారు. పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంతో పాటు ఊర్కొండపేట, రేవల్లి, తిమ్మన్నపల్లి, ముచ్చర్లపల్లి గ్రామాల్లో శాకాహార ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ధ్యానం-శాకాహారం అనే రెండు పట్టాలపై మానవుడు జీవన విధానం కొనసాగించాలని అన్నారు. బుద్ధుడి ప్రధాన ఆశయం అయిన అహింసో పరమోధర్మః అన్న సూక్తిని ఆచరించాలని ప్రజలకు సూచించారు. ఈ ర్యాలీలో ధ్యాన ప్రచార కార్యదర్శులు బాల కృష్ణారెడ్డి, భారతి, పిరమిడ్ సంస్థ స్థానిక సభ్యులు మదుసూదన్‌రెడ్డి, జంగయ్య, రవీందర్‌రెడ్డి, సుగుణ, సుజాత, పద్మ, శైలజ, చంద్రభాగ, పారిజాత, శోభ, ఉమమహేశ్వరి, సత్యనారాయ ణరెడ్డి, సుభాష్, శ్రీనివాస్‌రెడ్డి, ఓమేష్‌గౌడ్, యాదయ్య ఉన్నారు.

ఉప ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ, మే 25(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిధిలోని తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో సోమవారం జరిగే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హాజరవుతున్నట్లు ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం వెల్దండలో కాంగ్రెస్ పార్టీ నాయకులలో ఆయన మాట్లాడారు. ఖానాపూర్‌లో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, అదేవిధంగా పలు గ్రామాలలో ఏర్పాటుచేసే విద్యుత్ సబ్‌స్టేషన్లకు ఆయన మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవి, ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డిలతో కలిసి శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. అనంతరం జరిగే బహిరంగ సభను నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుండి పార్టీశ్రేణులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో నాయకులు భూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్, కేశమళ్ల కృష్ణ, వెంకటయ్యగౌడ్, పర్వత్‌రెడ్డి, రషీద్, ఎర్రశ్రీను, రమేష్, అలీ, కృష్ణ ఉన్నారు.

బైపాస్ బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

చారకొండ, మే 25 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల- కోదాడ జాతీయ రహదారిలో నిర్మాణంలో భాగంగా చారకొండ నుంచి మర్రిపల్లి వరకు 2 కిలో మీటర్ల మేరకు బైపాస్ రోడ్డులో ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఇంటి స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు చారకొండ చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బైపాస్ రోడ్డు బాధితులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే నిరుపేదలకు చెందిన 29 మంది ఇళ్లను పోలీస్ బందోబస్తు నడుమ నేల మట్టం చేసిన అధికారులు బాధితులకు నేటి వరకు ఎలాంటి ప్రత్యామ్నాయం చూపలేదని అన్నారు. వెంటనే అధికారులు స్పందించి బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని లేకుంటే ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు.

మైసమ్మ జాతరకు ప్రత్యేక బస్సులు కల్పించాలి

పెద్దకొత్తపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఆదివారం జరిగే పెద్దకొత్తపల్లి మండలం నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం అచ్చంపేట డిపో నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని భక్తులు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు. మైసమ్మ జాతరకు వచ్చే భక్తుల నుంచి ప్రైవేట్ వాహనదారులు అధికంగా డబ్బులు వసూలు చేస్తూ భక్తులను నిలువుదోపిడీ చేస్తున్నారు. అంతే కాకుండా డబ్బులకు కక్కుర్తిపడి ప్రైవేట్ వాహనాల్లో సామర్థ్యానికి మించి ఎక్కించుకుని తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని మైసమ్మ జాతరకు చేరుతున్నామని భక్తులు వాపోతున్నారు. ప్రైవేట్ వాహనాల్లో కుక్కి కుక్కి ప్రయాణికులను ఎక్కించి మైసమ్మ జాతరకు తరలిస్తున్న సందర్భంలో గమ్యస్థానానికి చేరుతామన్న నమ్మకం లేదని వాపోతున్నారు. ఆదాయ మార్గాలను అన్వేషించే ఆర్టీసీ అధికారులు ప్రతి ఆదివారం మైసమ్మ జాతరకు ప్రత్యేక బస్సులను నడపాలని మైసమ్మ దేవత దర్శనం కోసం వచ్చే భక్తులు కోరుతున్నారు.

రిటైర్డ్ ఆర్‌టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు ఎం ఉస్సేన్



మట్లాడుతున్న నాయకుడు ఎం.ఉస్సేన్

అచ్చంపేట టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రిటైర్డ్ ఆర్‌టీసీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు ఎం ఉస్సేన్ కోరారు. ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ యూనియన్ కార్యాలయంలో జహంగీర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులకు ప్రతీనెల వచ్చే రూ.1000 పెన్షన్‌ను పరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఈపీఎస్ డబ్బులు జమకాలేదని, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. అధిక పెన్షన్ కోసం ఆర్‌టీసీ ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నరని వారికి ఇప్పటి వరకు ఎలాంటి స్పందనా లేదని మరికొంత మంది దరఖాస్తు చేసుకోలేదని పేర్కొన్నారు. ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు తెల్లరేషన్ కార్డు, ఆసరా పెన్షన్, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం మహిళకు ఉచిత బస్సు సౌకర్యం లాగానే ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు కూడా లగ్జరి, డీలక్స్ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి కె.సాయిబాబా, వీసీ మౌళి, కరీం పాల్గొన్నారు.

నివాళి అర్పించిన మాజీ ఎమ్మెల్యే బీరం

పెద్దకొత్తపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దేదినేనిపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి గిరి మాతృమూర్తి నిరంజనమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. ఆదివారం దశదిన కర్మకాండ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రఎడ్డి హాజరై ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పెంట్లవెల్లి కొత్తపేట సింగిల్‌విండో చైర్మన్లు విజయరామారావు, కట్ట రాజేందర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ వెంకటయ్య యాదవ్, మండల రైతు సమన్వయ సమితి చైర్మన్ పి.నాగరాజు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుజ్జుల పరమేశ్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు రవినాయక్, కొల్లాపూర్ మునిసిపల్ కో ఆప్షన్ సభ్యుడు వెంకటస్వామి ఉన్నారు.

ఊరూరా గ్రామ దేవతల జాతరలే..

- బంధుమిత్రులతో సందడిగా మారిన పల్లెలు



బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న గ్రామస్థులు

అచ్చంపేట, మే 25 (ఆంధ్రజ్యోతి) : రెండు మూడేళ్లుగా అచ్చంపేట నియోజకవర్గంలోని పట్టణాలు, పల్లెల్లో బొడ్రాయి ప్రతిష్ఠ, గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ఠ, పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పండగకు ఊరంతా సందడే సందడి. మద్యం, మాంసాలతో ఊరూవాడ ఉర్రూతలూగుతోంది. ప్రతీ ఇల్లు బంధు మిత్రులతో కళకళలాడుతోంది. గ్రామంలోని కులసంఘాల ఆధ్వర్యంలో చందాలు పోగు చేసి గ్రామ దేవతల ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గడచిన నెల రోజులుగా అచ్చంపేట పట్టణంతో పాటు పులిజాల, ఉమ్మాపూర్ గ్రామాలలో నూతనంగా బొడ్రాయి ప్రతిష్ఠ నిర్వహించగా, ఉప్పునుంతల మండలం పెనిమిల్ల గ్రామంలో బొడ్రాయి పునఃప్రతిష్ఠ మహోత్సవాలు, బల్మూర్ మండలం గట్టుతుమేన్, చారకొండ మండలాలు, తదితర గ్రామాలలో గ్రామ దేవతల విగ్రహాల పునఃప్రతిష్ఠ మహోత్సవాలను కనుల పండువగా జరుపుకుంటున్నారు. ప్రతిష్ఠ ఉత్సవాలకు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరవుతున్నారు. కార్యక్రమాలను కుల, మతాలకు అతీతంగా జరుపుకుంటున్నారు.

ఏఎస్ఐ నారాయణకు సన్మానం



పదోన్నతి పొందిన ఏఎస్ఐ నారాయణను సన్మానిస్తున్న స్వేరోస్ నాయకులు

తెలకపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి) : తెలకపల్లి పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ నారాయణ ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. తెలకపల్లి స్వేరోస్ నాయకులు నారాయణను ఆదివారం ఘనంగా సన్మానించారు. స్వేరోస్ నాయకులు మాట్లాడుతూ తెలకపల్లికి ఎంతో అంకితభావంతో సేవ చేశారని, ఆయన మంచితనం వల్లే ఏఎస్ఐగా ప్రమోషన్ పొందారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శిక రెడ్డపాకుల శివశంకర్, తెలకపల్లి టౌన్ స్వేరోస్ అధ్యక్షుడు పరమేశ్వర్, టౌన్ ఉపాధ్యక్షుడు బల్మూరు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ దేవత దర్శనానికి పోటెత్తిన భక్తులు



నాయినోనిపల్లి మైసమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో కొలువైన మైసమ్మ దేవత దర్శనం కోసం ఈ ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ప్రత్యేక వాహనాల్లో మైసమ్మ దేవత దర్శనం కోసం భారీగా తరలివచ్చారు. బోనంకుండలో నైవేద్యం వండి ప్రత్యేకంగా అలంకరించి కోళ్లు, పొట్టేళ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం పెట్టి భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకు న్నారు. అమ్మవారి దర్శనానికి దాదాపు 20వేల కు పైగా భక్తులు రావడంతో ఆలయం ఆవరణ మంతా భక్తులతో కిటకిటలాడాయి. భక్తుల నుంచి టికెట్ల ద్వారా 96,400 రూపాయలు, హుండీ ద్వారా 2లక్షల 21, 397రూపాయలు మొత్తం 3లక్షల 17, 797రూపాయల ఆదాయం వచ్చినట్లు చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, ఆలయ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డిలు తెలిపారు. మైసమ్మ దేవత దర్శనం కోసం పెద్ద ఎత్తున వచ్చిన ప్రత్యేక వాహనాలతో పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో గంటల తరబడి ట్రాఫిక్ అంతరాయం కలిగింది. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు

అమ్రాబాద్, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు ఆరోపించారు. ఆదివారం అమ్రాబాద్ మండల కేంద్రంలోని బీజేపీ మండల అధ్యక్షతన బోడ్డుపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ నెల 26న అచ్చంపేట నియోజకవర్గంలో పలుఅభివృద్ధి కార్యక్రమాలకు శంకుసాపనలు చేయటానికి వస్తున్న నేపథ్యంలో బీజేపీ తరపున స్వాగతిస్తు న్నట్లు ఆయన తెలిపారు. హామీలను అమలు చేయాలని కోరారు. మండల అధ్యక్షులు శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి గోల్డ్ శివ, మాజీ మండల అధ్యక్షుడు గోలి రాజు, నేముల రాజు గౌడ్, సతీష్ కుమార్, లక్ష్మణ్ ఉన్నారు.